క్లుప్తంగా

వ్యాధులపై సర్వే



సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు : దెందులూరు, మేధినరావుపాలెం, గోపన్నపాలెం గ్రామాల్లో సోమవారం సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై సర్వే నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు రోజా, రాకేష్‌ల పర్యవేక్షణలో ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. ఎంపీహెచ్ఈఓ నాగరాజు సర్వేను పర్యవేక్షించారు.

మండల పరిషత్‌ను పరిశీలించిన అధికారులు

ఏలూరు రూరల్: జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఆర్డీఓ పెంచల కిషోర్ ఏలూరు మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం కోసం ఎంఎస్ఆర్ఈజీఎస్ సిబ్బంది గది, స్ట్రాంగ్ రూం కోసం పీఆర్ఏఈ గది, కౌంటింగ్ కోసం సమావేశ మందిరం సిద్ధం చేయాలని ఏఓ వై.సుజాతను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం లేకుండా ఆయా గదుల్లో ఉన్న వస్తువులు వేరే గదులకు తరలించాలన్నారు.

4న సాయిబాబా మందిర వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక శ్రీరామ్ నగర్ 1వ రోడ్డులో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 22వ వార్షికోత్సవం మార్చి 4న నిర్వహించనున్నట్టు మందిర ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం కాకడ హారతి, సాయిబాబా, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర శతనామ పూజలు, సౌందర్య లహరి, త్రిశూల పూజ, మధ్యాహ్న హారతి నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. అనంతరం సంధ్యా హారతి, శేజ్ హారతి నిర్వహిస్తామని, కాగా ఉత్సవాల ప్రారంభం సూచికగా మార్చి 3న సాయంత్రం 6 గంటల నుంచి సాయిబాబా వారికి పల్లకి ఉత్సవం ఉంటుందని వివరించారు.

5న ఉచిత మెగా వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హేలాపురి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మార్చి 5న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంఘ అధ్యక్షుడు ఎంటీఎస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. గుండె, చెవి, ముక్కు, గొంతు, చర్మ, శ్వాస, ఎముకలు, కీళ్లు, కంటి, డయాబెటిక్, బీపీ, గైనిక్ తదితర సమస్యలకు వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు.

ఏలూరు బోధనాసుపత్రికి కార్పొరేట్ లుక్

- రోగులకు మెరుగైన సౌకర్యాలు
- రూ.20 కోట్లతో ఆధునిక వైద్యసేవలు
- శరవేగంగా అభివృద్ధి పనులు

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి కార్పొరేట్ లుక్ వచ్చింది. ఏలూరు జిల్లా ప్రజల చిరకాల కోరిక మెడికల్ కాలేజీ శరవేగంగా పనులు సాగుతుండగా, బోధనాసుపత్రిని ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తున్నారు. గతంలో హాస్పిటల్‌లోకి వెళ్లేందుకు ముక్కుమూసుకోవాల్సి వచ్చేంది. ఇప్పుడు ఆ పరిస్థితులకు భిన్నంగా క్లీన్ హాస్పిటల్‌గా రూపుదిద్దుకుంటోంది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీని రూ.525 కోట్లతో ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఇక మరోవైపు బోధనాసుపత్రిని ప్రజలకు మెరుగైన, ఆధునిక వైద్య సేవలు, చికిత్సలను అందుబాటులోకి తెస్తూ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారు.

ప్రొఫెసర్ల నియామకం

ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి నేడు నూతన హంగులతో ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి (మెడికల్ కాలేజీ అనుబంధ హాస్పిటల్) నూతన శోభను సంతరించుకుంటోంది. సుమారు రూ.20 కోట్ల నిధులను వెచ్చిస్తూ అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం బోధనాసుపత్రి కావటంతో నిపుణులైన ప్రొఫెసర్ స్థాయి వైద్యులు అందుబాటులో ఉంటారు. రోగులకు అత్యుత్తమ స్థాయిలో వైద్య చికిత్సలు అందించేలా అన్ని విభాగాల్లోనూ ప్రొఫెసర్ల నియామకాన్ని చేపట్టారు. వారికి ప్రత్యేకంగా రూమ్‌లు ఏర్పాటు చేయటంతోపాటు, రోగులకు సైతం ప్రశాంతత, పరిశుభ్రమైన వాతావరణంలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈఎన్‌టీ, ఆర్థో, న్యూరో, ఇలా పలు విభాగాలకు ప్రొఫెసర్లను నియమించటంతో వైద్యసేవలు మెరుగ్గా ఉంటాయని చెబుతున్నారు.



ప్రతి రోజు సాధారణ రోగుల ఓపీ కేంద్రం



రోగులను పరీక్షించేందుకు ప్రొఫెసర్లకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన రూమ్‌లు



బోధనాసుపత్రి నర్సింగ్, ఇతర సేవల రూమ్‌లు

అత్యాధునిక వైద్యసేవలు



ఏలూరులోని ప్రభుత్వ బోధనాసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు, చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే హాస్పిటల్ ఆధునికీకరణ పనులు పూర్తి కావచ్చాయి. ఇంకా పలు విభాగాలకు సంబంధించి భవన నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మరో రెండేళ్లలో పూర్తిస్థాయిలో ఆధునిక వైద్య చికిత్సలు, సేవలు ప్రజలకు చేరువచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. 2023 విద్యా సంవత్సరంలో మెడికల్ కాలేజీ తరగతులు సైతం ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించే దిశగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– డాక్టర్ కేవీవీ విజయకుమార్, మెడికల్ సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి

జగన్ పాలనలో మహిళలకు ప్రాధాన్యత

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- శ్రీవారి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యురాలికి ఘన సత్కారం



వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్నింటా ప్రాధాన్యత ఇస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కాపు నేతల ఆధ్వర్యంలో శ్రీవారి దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులకు కాపు కల్యాణ మండపంలో సోమవారం అభినందన సభను నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి వెంకటకొండ పద్మ దంపతులకు దుశ్శాలువా కప్పి, గజ పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మొమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో హిందూ ఆలయాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగా ఆలయాలకు ట్రస్టుబోర్డులను ఏర్పాటు చేసి, మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. చినవెంకన్న దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావుతో కలసి ద్వారకాతిరుమల గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో సెంట్రల్ లైటింగ్, మంచినీటి ప్రధాన పైప్‌లైన్ మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. కొండపై ఆహ్లాదభరితమైన ఒక పెద్ద పార్కును ఏర్పాటు చేసేందుకు రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్, తాను యోచిస్తున్నట్టు చెప్పారు. భక్తుల కాలినడక మార్గమైన దూబచర్ల–ద్వారకాతిరుమల రహదారిని ఈ వేసవిలో నిర్మిస్తామని, అలాగే ఆ రోడ్డుకు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ద్వారకాతిరుమల–భీమడోలు రహదారిని రూ.18 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసినట్టు చెప్పారు. అనంతరం ట్రస్టుబోర్డు సభ్యురాలు వెంకటకొండ పద్మ, జ్యోతి శ్రీనివాస్ దంపతులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి దేవస్థానం నుంచి రావాల్సిన నిధులను ఎమ్మెల్యే తలారి, ఆలయ చైర్మన్ సుధాకరరావుల సహకారంతో తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, అంబటి గాంధి, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కుర్తి వెంకట్రావు, బొండాడ సాత్యకిరావు, యిమ్మడి నాగు, యిమ్మడి పవన్‌కుమార్, ఏసుబాబు, చిలుకూరి నాగసుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

బడుగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఆర్టీసీ నాన్ ఏసీ స్లీపర్ బస్‌ను ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ టీవీఎన్‌బీ రాజు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమని స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ టీవీఎన్‌బీ రాజు పేర్కొన్నారు. జగనన్న బడుగు వికాసం పథకం కింద లబ్ధిదారుకు మంజూరు చేసిన ఆర్టీసీ నాన్ ఏసీ స్లీపర్ బస్‌ను సోమవారం స్థానిక ఆర్టీసీ కొత్త బస్టాండులో ఆయన ప్రారంభించారు. అర్హత ఉన్నా అవకాశాలు లేక ఎంతో మంది పేదలు వెనకబడిపోతున్నారని, అటువంటి వారికి చేయూత ఇచ్చే ఉద్దేశంతో సీఎం జగన్ ప్రవేశ పెట్టిన జగనన్న బడుగు వికాసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాజు తెలిపారు. ఈ పథకం కింద తమ బ్యాంక్ ద్వారా లబ్ధిదారు అర్జా రమాదేవికి రూ.40 లక్షల రుణం మంజూరు చేశామని, దీనిలో దాదాపు 45 శాతం సబ్సిడీగా లభిస్తుందని అన్నారు. ఇటువంటి పథకంతో లబ్ధిదారుల కుటుంబాలు ఆర్థికంగా స్థిరపడతాయని, ముఖ్యమంత్రి ఆశయానికి తమ బ్యాంక్ ఆలంబనగా నిలుస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎస్ఎంఈ బ్రాంచ్ మేనేజర్ కె.లక్ష్మణ్, ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు వై.సురేష్ బాబు, వై.నరేష్, లబ్ధిదారు అర్జా రమాదేవి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



లక్కవరంలో మసీద్‌ను సందర్శించిన వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరం మసీద్‌ను సోమవారం వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ సందర్శించారు. మసీద్ కమిటీ సభ్యులు, స్థానికులతో ఆయన మాట్లాడి సమస్యలు, మసీద్‌కు వచ్చే ఆదాయ వనరులు అడిగి తెలుసుకున్నారు. మసీద్ ఆస్తుల మీద వచ్చే సంవత్సర ఆదాయానికి సంబంధించి వక్ఫ్‌బోర్డుకు ఫండ్ కట్టి రశీదు తీసుకోవాలని సూచించారు. పాత బకాయిలను వెంటనే చెల్లించాలని, తద్వారా ముస్లింలకు వక్ఫ్‌బోర్డు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మసీద్ కమిటీ సభ్యులకు కామిల్ జమ సూచించారు. మహానేత వైఎస్సార్ అడుగుజాడల్లో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముస్లింలకు అన్ని విధాలా అండగా ఉంటున్నారన్నారు. ముస్లింలకు రిజర్వేషన్, ఆరోగ్యశ్రీ, అమ్మ ఒడి, ఇళ్లస్థలాలు, వసతి దీవెన, వైఎస్సార్ షాధి తోఫా ప్రవేశపెట్టారన్నారు. పేద ముస్లిం యువతీ, యువకుల వివాహానికి లక్ష రూపాయలను ప్రభుత్వం ఇస్తోందన్నారు. హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు సబ్సిడీ కోట పెంచి హజ్ యాత్రకు పంపుతున్నట్లు వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కామిల్ జమ అన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన జిల్లాకు చెందిన వక్ఫ్‌బోర్డు భూములను తిరిగి వక్ఫ్‌బోర్డుకు చెందేలా కృషి చేస్తామన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో వక్ఫ్‌బోర్డు భూములు ఎక్కడా కబ్జాకు గురికాకుండా చర్యలు చేబడుతున్నామన్నారు. వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ షేక్ మొహమ్మద్ జహీర్, పఠాన్ అస్గర్ ఆలీ, షేక్ ఇమామ్, రహమతుల్లా, జనోత్ పాల్గొన్నారు.

వ్యసనాలతో భవిష్యత్ నాశనం చేసుకోవద్దు

భీమడోలు: చెడువ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా లోక్ అదాలత్ జడ్జి జి.రాజేశ్వరి అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. పిల్లలపై జరిగే నేరాలు, లైంగిక వేధింపులు, మత్తు పదార్థాలపై అవగాహన, మంచి స్పర్శ, చెడు స్పర్శలపై బాలబాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోక్‌అదాలత్ జడ్జి జి.రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వ్యసనాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 14 లోపు చిన్నారులను తల్లిదండ్రులు విధిగా పాఠశాలల్లో చేర్పించి చదివించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. మండల స్థాయిలో పిల్లలపై నేరాలు, లైంగిక నేరాలపై ప్రత్యేక విచారణ జరుగుతుందన్నారు. ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం అవసరమైతే వారి కుటుంబ వార్షికాదాయం రూ.3 లక్షల లోపు ఉండాలని సూచించారు. సీఐ వి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బారిన పడకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నట్లయితే పోలీసులకు ఫిర్యాదుచేయాలన్నారు. ఎస్సై చావా సురేష్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో బాలబాలికలు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను వివరించారు. వాటిని నిర్మూలనకు మనమంతా ఐక్యతగా పనిచేయాలన్నారు. పాఠశాలలో టీచర్లకు ప్రతి సమస్యను తెలియజేయాలన్నారు. యుక్త వయస్సులోనే తోటి స్నేహితుల మాటలకు ఆకర్షితులై తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరింకల విజయరాజు, న్యాయవాదులు అల్లాడ గంగాధరరావు, తోటప్రకాష్, పి.సంపదరావు పాల్గొన్నారు.

2న గ్రహణ మొర్రి వైద్య శిబిరం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమగ్రశిక్ష, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ సౌజన్యంతో మార్చి 2న గ్రహణ మొర్రి, చీలిన పెదవి, అంగిలి (క్లెఫ్ట్ లిప్, పాలెట్) బాధితులకు ఉచిత స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నట్టు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అశోక్ నగర్‌లోని అశోకవర్దని పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని, 6 నెలల ఉంచి 50 సంవత్సరాల వయసు గల బాధితులు హాజరు కావచ్చని తెలిపారు. గతంలో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు సైతం శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. పరీక్షల్లో శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి హైదరాబాద్‌లో ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి అవసరమైన మందులను, రవాణా ఖర్చులు కూడా చెల్లిస్తారని, ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. శిబిరానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు.

బ్యాంకుల సొమ్ము రికవరీ చేయాలి

ఏలూరు (టూటౌన్): డీసీసీబీ బ్యాంకుల అవకతవకలపై వెంటనే ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని, ప్రజల సొమ్మును రికవరీ చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. డీసీసీబీ బ్యాంక్లలో రూ.150 కోట్లు స్వాహా అయినట్టు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో భారీ బ్యాంక్ గోల్‌మాల్‌పై పత్రికల్లో వస్తున్న వార్తలు ఖాతాదారులను ఆందోళనకు గురిచేస్తున్నట్టు చెప్పారు. అవినీతి ఇలానే కొనసాగితే డీసీసీబీ బ్యాంకు కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులతో విచారణ చేయించాలని, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కామవరపుకోట, పెనుగొండ డీసీసీబీ బ్యాంక్‌లలో చేతివాటం చూపించారనే వార్తలు వస్తున్నాయని తెలిపారు. చాగల్లు బ్రాంచ్‌లో నకిలీ బంగారంపై అప్పుల కుంభకోణం జరిగిందన్నారు. పదేళ్ల క్రితం చాగల్లు షుగర్ ఫ్యాక్టరీకి ఇచ్చిన అప్పు రూ.10 కోట్లని, అది వడ్డీతో ఇప్పుడు దాదాపు రూ.30 కోట్లు అయ్యిందని, ఈ మొత్తాన్ని ఎవరు తీరుస్తారని, ఎవరు వసూలు చేస్తారని ప్రశ్నించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05–07
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	28	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	10–2
బెండకాయలు	40	కంద	46
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	30
కాకర కాయలు	30–36	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	64
బీరకాయలు (పందిరి)	56	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	13
క్యారెట్	24	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	18	తోటకూర	08
ఉల్లిపాయలు	18–20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	48	బఠాణి	54
అనపకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	31
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

పొలంబడి.. పెట్టుబడికి తగిన దిగుబడి

- రైతుల వద్దకే వ్యవసాయ అధికారులు
- 50 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ
- మండలంలో 6,223 ఎకరాల్లో సాగు



చొదిమెళ్లలో రైతులకు సేంద్రియ ఎరువు అందిస్తున్న దృశ్యం



చొదిమెళ్లలో నిర్వహించిన పొలం బడిలో పాల్గొన్న రైతులు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం రైతుల్లో ఉత్సాహం నింపుతోంది. కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. వ్యవసాయంలో మెలకువలు నేర్పిస్తోంది. పెట్టుబడికి తగిన దిగుబడి రాబట్టేందుకు మార్గం చూపుతోంది. సేంద్రియ ఎరువులు ఉపయోగం వల్ల కలిగే లాభాలను రైతులు గుర్తిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం సబ్సిడీపై వేపనూనె అందిస్తోంది. ఆర్‌బీకే ద్వారా నాణ్యమైన విత్తనాలు అందించడంతో రబీలో మంచి దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. ఇప్పటి వరకు పోణంగి, చొదిమెళ్ల, మల్కాపురం తదితర ప్రాంతాల్లో రైతులు, అధికారులు పొలం బడి కార్యక్రమాలు నిర్వహించింది.

6,154 ఎకరాల్లో సాగు

ఈ ఏడాది రబీలో ఏలూరు మండల రైతులు 6,154 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇందులో చొదిమెళ్లలో 168 ఎకరాలు, మల్కాపురం 752, శనివారపుపేటలో 5.53 ఎకరాలు, తంగెళ్లమూడిలో 14 ఎకరాలు, సత్రంపాడులో 4.85 ఎకరాలు, గవరవరం ఏరియాలో 16.39 ఎకరాలతో పాటు వెంకటాపురం బ్లాక్ మొత్తంలో 124.58 ఎకరాలు వరి సాగు చేస్తున్నారు. మరోపక్క జాలిపూడి, మాదేపల్లి, కాట్లంపూడి, చాటపర్రు తదితర ప్రాంతాల్లో రైతులు అపరాల పంట సాగు చేస్తున్నారు. దీంతో రబీ సాగులో అత్యధికంగా 4,549.11 ఎకరాల్లో పెసలు, 251 ఎకరాల్లో మినుములు సాగు చేస్తున్నారు. దీనికి తోడు మరో చొదిమెళ్ల పరిసరాల్లో మరో 269 ఎకరాల్లో మొక్కజొన్న పండిస్తున్నారు. అధికారులు రైతుల వద్దనే పొలం బడి నిర్వహిస్తూ దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తున్నారు.

రైతులకు రూ.6 లక్షల లబ్ధి

రైతులు అపరాల పంటపై ఆసక్తి చూపడంతో ప్రభుత్వం పెద్ద ఎత్తున సబ్సిడీపై విత్తనాలు అందించింది. సుమారు 11.81 లక్షల విలువ గల విత్తనాలను 50 శాతం సబ్సిడీపై 619 మంది సాగుదారులు అందుకున్నారు. ఫలితంగా సుమారు రూ.6 లక్షలు లబ్ధి పొందారు. దీనికి తోడు 33 మెట్రిక్ టన్నులు ఎరువులు 133 మంది రైతులకు అందించింది. దీనికి తోడు సేంద్రియ సాగువైపు రైతులు దృష్టి సారించేందుకు సబ్సిడీపై సేంద్రియ ఎరువులు అధికారులు అందిస్తున్నారు. ఫలితంగా రసాయనాలు ఎరువులు ఉపయోగం తగ్గుతోంది.

ఆశించిన దిగుబడి



డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులు మరిన్ని మెలకువలు తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సమయానికి అందించాం. దీనివల్ల రైతుల్లో ఉత్సాహం పెరిగింది. ఇదే సమయంలో పొలం బడిలో రసాయన ఎరువుల వల్ల కలిగే నష్టంపై చర్చించడం ఎంతో మేలు చేస్తోంది. సేంద్రియ ఎరువుల ఉపయోగించడం వల్ల లాభాలు వస్తాయని భావిస్తున్నారు.

– ఎ.జీవనసంధ్య, ఎంఏఓ